క్లుప్తంగా

మోదకొండమ్మ పాదాలు తీర్థం పోస్టరు విడుదల



తీర్థం పోస్టరు విడుదల చేస్తున్న వర్తక సంఘం సభ్యులు

మాడుగుల: ఘాట్‌రోడ్ జంక్షన్‌లో వెలసిన మోదకొండమ్మ పాదాలు తీర్థం వచ్చే నెల 5వ తేదీన నిర్వహించనున్నట్లు వర్తక సంఘం సభ్యులు తెలిపారు. ఈ మేరకు అమ్మవారి ఆలయంలో ఆదివారం వారు తీర్థం పోస్టరు విడుదల చేశారు. రేస్ గుర్రాలు, పరుగు పందెంతో పాటు, విద్యుత్ లైటింగ్, నేలవేషాల నడుమ తీర్థం వైభవంగా నిర్వహించడానికి కమిటీ తీర్మానించింది. కార్యక్రమంలో వర్తక సంఘ సభ్యులు పుట్టా బలరామ్, కోట్ని సత్తింబాబు, పి. కొండలరావు, పి.నాని, యన్నంశెట్టి వెంకటరావు, ఎస్. నాగేశ్వరరావు, పి. శంకర్, డి.వాసు పాల్గొన్నారు.

నామినీ వీఆర్‌ఏలకు న్యాయం చేయాలి

మాడుగుల రూరల్: నామినీ వీఆర్‌ఏలకు ఉద్యోగావకాశాలు కల్పించి, జీతం పెంపుదల చేయాలని ఏపీ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోని చిన అప్పారావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అర్హులైన వీఆర్‌ఏలకు వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని, పేస్‌యాప్ రద్దుతోపాటు పెండింగ్ డీఏ మంజూరు చేయాలని, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ముగిసిన భక్తాంజనేయ ఆలయ వార్షికోత్సవం



స్వామివారిని దర్శించుకుంటున్న ధర్మశ్రీ

రావికమతం: కొత్తకోట భక్తాంజనేయ స్వామి ఆలయ 29వ వార్షికోత్సవం ఆదివారంతో ముగిసింది. మూడు రోజులుగా ఉత్సవాలను ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తున్నారు. మూడో రోజు ఉత్సవాల్లో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కేదారిశెట్టి గున్నాజీరావు, సభ్యులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందించారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.


సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్టకు ఆహ్వానం



డిప్యూటీ సీఎంతో ఆలయ కమిటీ సభ్యులు

మాడుగుల రూరల్: ఎం. కోడూరు కాశీవిశ్వేశ్వర ఆలయంలో నూతనంగా నిర్మించిన శ్రీవల్లి దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి త్రయాహ్నిక దివ్య విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వచ్చే నెల 1వ తేదీన నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును ఆలయ కమిటీ సాదరంగా ఆహ్వానించింది. సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు ఆధ్వర్యంలో ఆదివారం తారువ క్యాంపు కార్యాలయంలో కలిసి కలిసింది. ఆలయ కమిటీ చైర్మన్ చింతా వెంకటరమణమూర్తి, గ్రామ శాఖ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు పాల్గొన్నారు.

బారికేడ్ల ఏర్పాటు



బారికేడ్లు సిద్ధం చేస్తున్న ఎస్‌ఐ లక్ష్మీనారాయణ

నాతవరం: రోడ్డు ప్రమాదాల నివారణకు బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నామని ఎస్‌ఐ డి. లక్ష్మీనారాయణ ఆదివారం తెలిపారు. మండలంలో పలు ప్రమాదకర రోడ్లపై వీటిని ఏర్పాటు చేశారు. యువత చెడు వ్యసనాలకులోనైతే జీవితం ఏవిధంగా దుర్భరంగా ఉంటుందో పోస్టర్ల ద్వారా అవగాహన కల్పించారు. ఫ్రెండ్లీ పోలీసు విధానానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. పేద విద్యార్థులకు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారికి ప్రోత్సాహం ఉంటుందన్నారు.

ఉగాదికి.. గృహ ప్రవేశాలు

- ఆ లోగా 1,972 ఇళ్లు పూర్తి చేయాలని లక్ష్యం
- పనుల పూర్తికి అధికారుల చర్యలు



గురందరపాలెం జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు

నర్సీపట్నం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని వచ్చే ఉగాదికి పేదలు స్వగృహ ప్రవేశాలు చేయనున్నారు. ఆలోగా నర్సీపట్నం నియోజకవర్గంలో 1,972 ఇళ్లు పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇవి పూర్తి చేసేందుకు లబ్ధిదారులను ప్రోత్సహించడంతో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పేదలందరికీ సొంత గూడు కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జగనన్న కాలనీల్లో ఉగాదికి సామూహిక గృహ ప్రవేశాలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతున్నారు.
నియోజకవర్గంలో మొత్తం 160 లే అవుట్లలో మట్టితో చదును చేసి, నీటి వసతి, రహదారి సౌకర్యాలు కల్పించడంతో ముమ్మరంగా జగనన్న గృహ నిర్మాణాలు జరుగుతున్నాయి. నియోజకవర్గంలో 8,979 ఇళ్లు మంజూరు చేశారు. ఇందులో ఇప్పటి వరకు 952 ఇళ్లు పూర్తి చేయగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. గృహ నిర్మాణ శాఖ సిబ్బంది ఎప్పటికప్పుడు నిర్మాణాల స్థాయిని బట్టి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తుండటంతో బిల్లులు మంజూరవుతున్నాయి. ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఇచ్చే నగదుతోపాటు అదనంగా డ్వాక్రా రుణం జోడించి ఇస్తుండటంతో నిర్మాణాలు వేగం అందుకున్నాయి.

నియోజకవర్గంలో నర్సీపట్నం మున్సిపాలిటీ, నర్సీపట్నం, నాతవరం, మాకవరపాలెం, గొలుగొండ మండలాల్లో పనుల ప్రగతి వివరాలు ఇలావున్నాయి.

మంజూరైన ఇళ్లు	: 8,979
పునాదుల దశలో	:1637
పూర్తయినవి	:952
శ్లాబు దశలో	: 515
రూఫులెవల్	: 384
వివిధ దశల్లో ఉన్నవి	:5,356
కోర్టు కేసుల్లో	:135

లక్ష్యాన్ని అధిగమించే దిశగా అడుగులు...



ఉగాదిలోగా నర్సీపట్నం నియోజకవర్గంలో 1,972 ఇళ్లు పూర్తి చేయాలనుకుంటున్నాం. ప్రభుత్వ లక్ష్యాన్ని పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నాం. గృహ నిర్మాణాలకు ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని లబ్ధిదారులకు వివరిస్తున్నాం. నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచిస్తున్నాం.

– ఎల్.శ్రీఫణి, డీఈఈ, నర్సీపట్నం

నేడు నియోజకవర్గ స్థాయి సమావేశం

హాజరు కానున్న పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



సభా వేదిక, ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీపీ జగన్‌మోహన్

కె.కోటపాడు: వైఎస్సార్‌సీపీ మాడుగుల నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం కె.కోటపాడులో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కానుంది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఉత్తరాంధ్ర జిల్లాల పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డితోపాటు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, పార్టీ జిల్లా నాయకులు హాజరు కానున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ తెలిపారు. ఇక్కడ సభా నిర్వహణ వేదికతోపాటు సంబంధిత ఏర్పాట్లను ఆదివారం ఆయన పర్యవేక్షించారు. మాడుగుల, కె.కోటపాడు, చీడికాడ, దేవరాపల్లి మండలాల నుంచి ఐదు వేల మంది సర్పంచ్‌లు, ఎంపీటీసీ, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతోపాటు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, తదితరులు పాల్గొంటారన్నారు.

విజయవంతం చేయండి...

మాడుగుల/చీడికాడ: నియోజకవర్గ స్థాయి కార్యకర్తలు సమీక్షా సమావేశం కె. కోటపాడులో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు జరగనుందని వైఎస్సార్‌సీపీ మాడుగుల, చీడికాడ మండలాధ్యక్షులు తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, గొల్లవిల్లి రాజుబాబు తెలిపారు. పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సోషల్ మీడియా కన్వీనర్లు, సహకార, పాల సంఘాల అధ్యక్షులు, తదితరులు హాజరు కావాలని కోరారు. ఆయా మండలాల్లోని అన్ని పంచాయతీల నుంచి పార్టీ కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలి



జోగుంపేటలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



జైతవరంలో ప్రచారం చెస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

గొలుగొండ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ జోగుంపేట, పాలకపాడు, గొలుగొండ, రావణాపల్లి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నేతలు ఆదివారం ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి సీతంరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, సచివాలయం మండల కన్వీనర్ పాణీశాంతారాం, ఏఎంసీ చైర్మన్ సత్యనారాయణ, చోద్యం సహకార బ్యాంక్ చైర్మన్ పెద్దిరాజు, గొలుగొండ సర్పంచ్ కసిపల్లి బుజ్జి, ఎస్సీ విభాగం నాయకుడు జువ్వల దేముడు, మాజీ సర్పంచ్ చిటికెల వరహాలబాబు తదితర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌ను గెలిపించాలి

చీడికాడ: వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని ఆ పార్టీ నేతలు ఆదివారం పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చుతూ రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయ్యాలని పట్టభద్రులను కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, జెడ్పీటీసీ భర్త లాలం జానకీరాం, యువజన విభాగం అధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జి ఈర్లె చైతన్య, చీడికాడ గ్రామ శాఖ అధ్యక్షుడు పరవాడ మహేష్ పాల్గొన్నారు.

హోరాహోరీగా జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పందేలు

వైభవంగా అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కె.కోటపాడు: హోరాహోరీగా జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పందేలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీల్లో కలగాడ విజేతగా నిలిచింది. అభయాంజనేయస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం పాడుగుపాలెంలో ఈ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రథమ స్థానానికి రూ.10 వేలు, ద్వితీయ స్థానంలో కె.ఎల్.బి.పురం ఎడ్లబండికి రూ.8 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన కూండ్రం ఎడ్ల బండి రూ.6 వేలు దక్కించుకున్నాయి. తర్వాత నాలుగు, ఐదారు స్థానాలకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ముందుగా ఉదయం నుంచి గ్రామస్తులతోపాటు సమీప గ్రామాల భక్తులు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. వార్షికోత్సవ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా పుష్పాలంకరణతో అందంగా ముస్తాబు చేశారు. గ్రామానికి చెందిన దొగ్గ అప్పన్నబాబు, సత్యనారాయణ, డేన్ ఫౌండేషన్ చైర్మన్ దొగ్గ అచ్చింనాయుడు రూ.20 వేలు విరాళమందించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు అక్కునాయుడు, ఉప సర్పంచ్ దొగ్గ దేముళ్లు, ఎంపీటీసీ లెక్కల గౌతమి, శంకరరావు, దొగ్గ శివప్రసాద్ (లాయర్), లెక్కల గణేష్ పాల్గొన్నారు.

నేడు కె.జె.పురంలో తీర్థం

మాడుగుల రూరల్: కె.జె.పురం నుంచి అప్పలరాజుపురం వెళ్లే రహదారిలో దివంగత కర్రి రామునాయుడు విగ్రహం వద్ద ఆయన తీర్థం సోమవారం నిర్వహించనున్నట్లు కర్రి మల్లికార్జునరావు, నాగమణి దంపతులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమం, ఆలయం వద్ద అన్నసమారాధన, కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

విజ్ఞాన భాండాగారాలు గ్రంథాలయాలు

- హెచ్‌ఎం అప్పారావు



మాట్లాడుతున్న హెచ్‌ఎం అప్పారావు

కె.కోటపాడు: గ్రంథాలయాల్లో విలువైన మేధా సంపత్తిని ఉద్యోగార్థులు సద్వినియోగం చేసుకొని లక్ష్యాలను అందిపుచ్చుకోవాలని రోలుగుంట హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఈర్లె అప్పారావు తెలిపారు. చౌడువాడ శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఆయన యువకులకు అవగాహన కల్పించారు. రోజూ పుస్తక పఠనం అలవాటుగా చేసుకోవడం ద్వారా విజ్ఞానం మెరుగుపడనుందని వివరించారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉండటం వల్ల ఉద్యోగార్థులకు ఆర్థిక ఇబ్బందులు ఉండవని తెలిపారు. గ్రంథపాలకురాలు పద్మావతి పాల్గొన్నారు.

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారి ఆలయంలో భక్తులు, నూతన దంపతులు

మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయానికి ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. విశాఖ, తుని, రాజమహేంద్రవరం, అనకాపల్లి, నర్సీపట్నం పట్టణాలతోపాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దాంతో ఆలయ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. కొత్తగా వివాహం చేసుకున్న 50 జంటల వరకు వారి బంధువులతో అమ్మవారిని దర్శించుకున్నారు. అదేవిధంగా గ్రామానికి చెందిన భక్తులు వీధి పండుగలు నిర్వహించడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ప్రత్యేకంగా కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వైభవంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం



ఉత్సవ మూర్తులను దర్శించుకుంటున్న నాయకులు

రోలుగుంట: కొవ్వూరులో గౌరీపరమేశ్వరుల ఉత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పోతల లక్ష్మీశ్రీనివాస్, మడ్డు అప్పలనాయుడు, భక్తులు ఉత్సవమూర్తులకు పూజలు చేశారు. సాయంత్రం కోలాటం పోటీలు, రాత్రికి ఆర్కెస్ట్రా, భాగవతం, గ్రూపు డ్యాన్సు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా నేలడ్యాన్సు, బాణసంచా పేలుళ్ల మధ్య ఉత్సవమూర్తులను ఊరేగించారు. సోమవారం స్థానిక చెరువులో నిమజ్జనం చేస్తామని ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ కాంతమ్మ తెలిపారు.

చిల్డ్రన్ క్లబ్‌కు విశేష ఆదరణ



చిన్నారులకు పోటీలు నిర్వహిస్తున్న గ్రంథాలయ అధికారి

నర్సీపట్నం: విద్యార్థులు గ్రంథాలయాన్ని అలవాటుగా చేసుకునేందుకు చిల్డ్రన్ క్లబ్‌లు నిర్వహిస్తున్నామని గ్రంథపాలకురాలు దమయంతి తెలిపారు. ఇక్కడ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన చిల్డ్రన్ క్లబ్‌లో పిల్లలకు పలు రకాల పుస్తకాలను పరిచయం చేశారు. గ్రంథాలయాల ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని సూచించారు. ప్రతి వారం చిన్నారులు విధిగా చిల్డ్రన్ క్లబ్‌కు విచ్చేసి ఇక్కడ లభిస్తున్న పుస్తకాలను చదవటం అలవాటు చేసుకోవాలని సూచించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వారిని అభినందించారు.

విద్యార్థినులకు దుప్పట్ల పంపిణీ



విద్యార్థినులకు దుప్పట్లు అందచేస్తున్న సన్యాసిరావు

చోడవరం రూరల్: విద్యార్థి దశలో చక్కగా చదువుకుంటే భవిష్యత్‌లో ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చని అంబేడ్కర్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు నడుపూరి సన్యాసిరావు తెలిపారు. ఆదివారం చీడికాడ రోడ్డులోని సాంఘిక సంక్షేమ కళాశాలల వసతి గృహంలో 60 మంది విద్యార్థినులకు ఆయన దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుకునే దశలో సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంబేడ్కర్ భవన్‌లో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశామని, పోటీ పరీక్షలకు ఉపకరించే పలు పుస్తకాలు, స్టడీ మెటీరియల్ ఉన్నాయన్నారు. 21–22 విద్యా సంవత్సరానికి చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ప్రతిభ చూపి మంచి మార్కులు సాధించిన మెరిట్ విద్యార్థులకు ట్రస్టు తరపున మూడు వేల రూపాయల మెరిట్ స్కాలర్‌షిప్ అందచేస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కండేల వెంకటరావు, జుంజూరు అప్పారావు, వేచలపు రామారావు, వరప్రసాద్ పాల్గొన్నారు.

పూర్తయిన దేవరాపల్లి–చిననందిపల్లి తారురోడ్డు



దేవరాపల్లి నుంచి చిననందిపల్లి మధ్య నిర్మించిన తారు రోడ్డు

దేవరాపల్లి: డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో దేవరాపల్లి నుంచి చిననందిపల్లి వరకు తారు రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. 3.6 కిలోమీటర్ల మేర ఈ రోడ్డు నిర్మాణానికి రూ. 2.12 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో దేవరాపల్లి రైవాడ ఎడమ కాలువ గట్టు నుంచి సంతోట, ముత్యాలమ్మపాలెం, కన్నంనాయుడు కల్లాలు, పైడమ్మ చెరువు గట్టు మీదుగా చిననందిపల్లి వరకు తారురోడ్డు నిర్మించారు. దీనికి చిననందిపల్లి నుంచి కాశీపురం–గవరవరం ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు 260 మీటర్ల మేర సీసీరోడ్డు నిర్మించి అనుసంధానం చేశారు. ఈ రోడ్డుకు వైట్ లైన్లు వేయడంతో అందంగా కనిపిస్తోంది. గతంలో ఈ రోడ్డులో కాలినడకన వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డామని, ఇప్పుడు ఈ కష్టాలు తప్పాయని డిప్యూటీ సీఎంకు ఆయా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

40 మంది చిన్నారులకు ఆధార్ నమోదు



చిన్నారి ఆధార్ నమోదు చేస్తున్న నిర్వాహకుడు

రోలుగుంట: స్థానిక మీ సేవ కేంద్రంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న చిన్నారులకు ఉచిత ఆధార్ నమోదు కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిబిరంలో 40 మంది చిన్నారులకు ఆధార్ నమోదు చేశామని, ఈ కార్యక్రమం సోమ, మంగళవారాలు కొనసాగుతుందని నిర్వాహకుడు నాయుడు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు చిన్నారి జన్మదిన ధ్రువపత్రం, తల్లి తేదా తండ్రి ఆధార్ తీసుకు రావాలని సూచించారు.

అనకాపల్లి సుగర్స్ పరిరక్షణకు కృషి

- రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం



అనకాపల్లి సుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

అనకాపల్లి రూరల్ : ఎంతోమంది రైతులు, కార్మిక కుటుంబాలకు జీవనాధారమైన అనకాపల్లి సుగర్ ఫ్యాక్టరీని లిక్విడేషన్ నుంచి ప్రభుత్వం కాపాడాలని అఖిల పక్ష రాజకీయ, ప్రజా రైతు సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు కోరారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సభలో వ్యవసాయదారుల సంఘం ఉపాధ్యక్షుడు విల్లూరి పైడారావు, సీపీఐ నాయకుడు వైఎన్ భద్రం, సీపీఎం నేత బాలకృష్ణ, ఏపీ చెరకు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్రి అప్పారావు, జనసేన నాయకుడు శ్రీరామదాస్ గోవింద్ మాట్లాడారు. సుగర్ ఫ్యాక్టరీని పరిరక్షించుకోవడం కోసం ఐక్యంగా పోరాటం చేయాలని తీర్మానించారు. ఈ ఫ్యాక్టరీని ఆధునికీకరించి, చెరకు క్రషింగ్ జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందులో సీపీఐ నాయకులు దొరబాబు, కోన లక్ష్మణ్, సీపీఎం నాయకులు గంటా శ్రీరామ్, చెరకు రైతు సంఘం నాయకులు కోరిబిల్లి శంకరరావు, దూలం గోపి, మళ్ల శ్రీను, బొడ్డేడ అప్పారావు, బట్ట చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఐఐ చైర్మన్‌గా లాల్‌కృష్ణ నియామకంపై హర్షం



పరవాడ: జీఎస్ ఫార్మాసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.పి.లాల్‌కృష్ణ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) విశాఖ జోన్ చైర్మన్‌గా నియామకం కావడంతో జీఎస్ ఫార్మా పారిశ్రామిక వేత్తలు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. నగరంలో శనివారం జరిగిన సీఐఐ వార్షిక సమావేశంలో సభ్యులు ఈ మేరకు తీర్మానించారు. రాంకీ ఎండీగా వ్యవహరిస్తూ దేశ విదేశాల నుంచి ఫార్మా కంపెనీలను జీఎస్ ఫార్మాసిటీలోకి తీసుకురావడంతోపాటు ఫార్మా రంగంలో ఆయనకున్న అపార అనుభవమే సీఐఐ చైర్మన్ పదవి అధిష్ఠించడానికి కారణమని పలువురు పారిశ్రామికవేత్తలు పేర్కొన్నారు. రాంకీ కమర్షియల్ హబ్‌లో ఆదివారం నిర్వహించిన అభినందన సభలో డాక్టర్ లాల్‌కృష్ణను రాంకీ కుటుంబ సభ్యులు, ఉద్యోగులు, పారిశ్రామిక వేత్తలు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఐఐ చైర్మన్ పదవితో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. పదవికి సముచిత న్యాయం చేస్తానని డాక్టర్ లాల్‌కృష్ణ అన్నారు.

సచివాలయ ఉద్యోగిపై దాడి దారుణం



మాట్లాడుతున్న నాయకులు

అనకాపల్లి రూరల్ : చోడవరం మండలం అడ్డూరు గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ బి.సతీష్ శ్రీనివాస్‌పై అడ్డూరు వైఎస్సార్‌సీపీ నాయకులు దాడి చేశారంటూ సీఐటీయూ నాయకులు ఆరోపించారు. ఆదివారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌పై దాడి చేయడం దారుణమన్నారు. నిరంతరం ప్రజల మధ్య పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

భారతీయ సంస్కృతిని ప్రోత్సహించడమే లక్ష్యం

- ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా
- ఉత్సాహంగా ఆనంద మేళా



విద్యార్థులకు సైకిళ్లు అందజేసిన సిన్హా

పరవాడ: భారతీయ వారసత్వం, సంస్కృతిని ప్రోత్సహించడమే ఆనంద మేళా లక్ష్యమని సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ, దీపిక లేడీస్ క్లబ్ సంయుక్తంగా దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లోని సాధన క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన ఆనంద మేళాను సిన్హా ప్రారంభించారు. దీపిక లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజూ సిన్హా ఆహుతులకు స్వాగతం పలికారు. అనంతరం సిన్హా మాట్లాడుతూ సమాజ ఉద్ధరణకు దీపిక లేడీస్ క్లబ్ సహకారం అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెరిటోరియస్ విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. మేళాలో భాగంగా భారతీయ వంటకాలను ప్రదర్శనలో ఉంచారు. విద్యార్థులు సాంస్కృతిక నృత్య రూపాలు, సాంప్రదాయ కళలను ప్రదర్శించి ఆహుతుల మన్ననలు పొందారు. కార్యక్రమంలో సంస్థ ఉన్నతాధికారులు, దీపిక లేడీస్ క్లబ్ ప్రతినిధులు, సభ్యులు, అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.